క్లుప్తంగా

అక్రమ ఇసుక రవాణాపై చర్యలు

మణుగూరురూరల్: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఇసుక పాలసీల విషయంలో ప్రభుత్వం నూతన నియమ నిబంధనలు, చట్టాలను తీసుకొచ్చిందని, ఈ నిబంధలనకు ప్రకారం ఎవరూ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేయకూడదని అన్నారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి ఇసుక అక్రమ రవాణా చేస్తే సహించేది లేదని, వారిపై క్రిమినల్, బైండోవర్ కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు.

మజ్జిగ ప్యాకెట్లు, పులిహోర పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వెంకటరెడ్డి, ఎస్సై తిరుపతిరావు, మల్లారెడ్డి

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ చంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం భక్తులకు ఎండ నుంచి ఉపశమనం కోసం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్య ఆగ్రో ఏజెన్సీస్ వారి ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఎస్సై తిరుపతిరావు ప్రారంభించారు. భక్తులకు 8వేల మజ్జిగ ప్యాకెట్లు, పులిహోర అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ మర్రి మల్లారెడ్డి, ప్రొప్రైటర్ సోమ వెంకటరెడ్డి, తూము సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు అన్నదానం

చర్ల: మండల కేంద్రమైన చర్లలో ఆదివారం మేమున్నాం సహాయక కమిటీ ఆధ్వర్యంలో వారపు సంతకు వచ్చిన ఆదివాసీలకు అన్నదానం నిర్వహించారు. సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా జిల్లాల్లోని ఆదివాసీలు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు వస్తుండగా.. వారి ఆకలి తీర్చాలన్న సంకల్పంతో ప్రతీ ఆదివారం దాతల సహకారంతో మేమున్నాం సహాయక కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈ ఆదివారం కూడా అన్నదానాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 400 మంది ఆదివాసీలు పాల్గొన్నారు.

విజేత జట్టుకు బహుమతి

దమ్మపేట: మండల పరిధిలోని నాగుపల్లి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన క్రికెట్ టీంకు బహుమతిగా కప్‌తో పాటుగా నగదును ఆదివారం నిర్వాహకుల ద్వారా అందజేశారు. నాగుపల్లి గ్రామంలో నిర్వహించిన ఎన్‌పీఎల్ సీజన్- 3 క్రికెట్ టోర్నమెంట్‌లో, సత్తుపల్లి లెవెన్ బుల్లెట్స్ టీం విజేతగా నిలిచి, రూ.25,000ల నగదు బహుమతిని కై వసం చేసుకుంది. ప్రథమ బహుమతికి అవసరమైన నగదును మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, అంగోతు కోటేశ్వరరావు స్పాన్సర్ చేశారు. విజేతగా నిలిచిన జట్టు క్రీడాకారులను పలువురు నాయకులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు అనిల్, రాజా, వెంకటేష్, చెన్నారావు పాల్గొన్నారు.

ఇది డంపింగ్ యార్డు కాదు..



సున్నంబట్టి వెళ్లే మార్గంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

అశ్వారావుపేటరూరల్: డంపింగ్ యార్డుకు తరలించాల్సిన చెత్తచెదారం, వ్యర్థాలను కొంత కాలంగా ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ ఖాళీ స్థలంలో పడేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేట మండలం మామిళ్ల వారిగూడెం గ్రామ పంచాయతీకు శివాలయం మార్గంలో డంపింగ్ యార్డు ఉంది. గ్రామ పంచాయతీ పరిధిలో సేకరించే చెత్తచెదారం, ఇతర వ్యర్థాలను ఈ డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. కానీ పంచాయతీ కార్యదర్శి సబిత పర్యవేక్షణ లేకపోవడంతో పంచాయతీ సిబ్బంది ఆ వ్యర్థాలను సున్నంబట్టి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పడేస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డు ఉన్నా.. ప్రధాన రహదారి పక్కనే వ్యర్థాలు పేరుకుపోయాయి. ఆ ప్రాదేశంలో చెత్తచెదారం, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి డంపింగ్ యార్డును తలిపిస్తోంది. కాగా, ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారంతా ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోంది. దీనిపై స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. తన దృష్టికి రాలేదని, చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ఆర్‌అండ్‌బీ X విద్యుత్ శాఖ

- పేటలో రెండు శాఖల మధ్య వివాదం
- చిచ్చుపెట్టిన రోడ్డు విస్తరణ, డ్రెయినేజీ పనులు



వివాదానికి కారణమైన కరెంట్ స్తంభాలు, విద్యుత్ లైన్లు

అశ్వారావుపేటరూరల్: గడిచిన ఏడాది కాలంగా ఆగుతూ.. సాగుతున్న మెగా డ్రెయినేయిజీ, రహదారి విస్తరణ పనులు వివాదాలకు దారి తీస్తున్నాయి. ఇప్పటి దాకా ఆక్రమణదారులు, అధికారులు, రాజకీయ నాయకుల మధ్య జరిగిన ఈ వివాదాలు, తాజాగా ఓ రెండు శాఖల మధ్యకు చేరాయి.

అశ్వారావుపేట పట్టణంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సుందరీకరణ, రహదారుల విస్తరణ, రెండు వైపులా మెగా డ్రెయినేయిజీ నిర్మాణాల పనులకు గత ప్రభుత్వ హయంలో మోక్షం కలిగిన సంగతి తెలిసిందే. ఈ పనుల్లో భాగంగా ఖమ్మం-దేవరపల్లి మార్గంలో 2 కిలో మీటర్ల పొడవున డివైడర్ నిర్మాణంతోపాటు ఇరువైపులా రహదారి విస్తరణ, డ్రెయినేజీ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ కోసం రూ.8కోట్లు, అలాగే అశ్వారావుపేట-భద్రాచలం మార్గంలో 1.50 కి.మీటర్ల పనులకు మరో రూ.10కోట్లు వ్యయంతో పనులు చేపట్టారు. ఈ పనులు ప్రారంభించి ఏడాది పూర్తి కాగా.. నేటికీ తీరు తెన్ను లేదు. ఇప్పటి దాకా ఖమ్మం-దేవరపల్లి మార్గంలో డివైడర్ నిర్మాణం 90 శాతం పూర్తి కాగా, రహదారి విస్తరణ, డ్రెయినేజీ నిర్మాణాలు 70శాతం పూర్తి అయ్యాయి. దీంతో ఆయా పనులన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి. కాగా, విస్తరణ, డ్రెయినేజీ పనులు దాదాపు నెల రోజులుగా ముందుకు కదలడం లేదు. దీనికి శాఖల మధ్య తలెత్తిన వివాదమే కారణమని తెలుస్తోంది.

ఆర్‌అండ్‌బీ అనుమతులు తీసుకోవాలి

రోడ్లు భవనాల శాఖ నిబంధనల ప్రకారం కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర టవర్లను రహదారుల వద్ద ఏర్పాటు చేయాల్సి వస్తే ఇక నుంచి శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి స్థానిక ఆ శాఖ ఏఈఈ రామిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు రెండు శాఖల మధ్య వివాదంపై 'సాక్షి'వివరణ కోరగా..ఆయన పై విధంగా స్పందించారు. అనుమతులు లేకుండా రోడ్లకు ఆనుకొని కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేశారని, వాటిని అభివృద్ధి పనుల కోసం పక్కకు మార్చేందుకు విద్యుత్ శాఖ నగదు చెల్లించాలని నోటీసులు జారీ చేసిందన్నారు. మా శాఖ రోడ్లపై ఇంతకాలం అడ్డగోలుగా ఏర్పాటు చేయడమే కాకుండా, ఆర్‌అండ్‌బీ శాఖ ఆ వ్యయాన్ని భరించడం ఏంటని ప్రశ్నించారు. ఇక నుంచి రోడ్ల వెంట కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టడానికి వీలులేదని, ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి అనుమతులు పొందాలని అన్నారు.

శాఖల మధ్య వివాదం ఇదీ..

డ్రెయినేజీ, రోడ్డు విస్తరణ పనులకు గతంలో ప్రధాన రహదారులకు అనుకుని వేసిన కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు ఇప్పుడు రోడ్డు భవనాలు, విద్యుత్ శాఖ మధ్య వివాదానికి కారణమయ్యాయి. ఈ పనులకు అడ్డుగా ఉన్న కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను అడ్డు తొలగించి పక్కన ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.కోటి 54లక్షల వ్యయాన్ని చెల్లించాలని రెండు నెలల క్రితం విద్యుత్ శాఖ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులు అందుకున్న ఆర్‌అండ్‌బీ శాఖ షాక్‌కు గురైంది. గతంలో ఆర్‌అండ్‌బీ అనుమతులు లేకుండా రోడ్లపై అడ్డగోలుగా స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి తాజాగా అభివృద్ధి పనుల్లో భాగంగా వాటిని పక్కకు తొలగించాలని కోరితే నగదు చెల్లించాలని నోటీసులు ఇవ్వడం ఏంటని ఆర్ అండ్‌బీ శాఖ మండిపడుతోంది. దీంతో ఈ రెండు శాఖల మధ్య వివాదానికి తెరలేచింది. కాగా, ట్రాన్స్‌కో ద్వారా అందిన నోటీసులను ఆర్‌అండ్‌బీ శాఖ తమ ఉన్నతాధికారులు, ఈఎన్‌సీకు సమర్పించారు. ప్రస్తుతం ఈ నగదు చెల్లింపు కార్యక్రమం ఈఎన్‌సీ వద్దకు చేరింది.

ఈ నేపథ్యంలో డ్రెయినేజీ, రోడ్ల విస్తరణ పనులు ఈ రెండు శాఖల మధ్య వివాదానికి కారణమయ్యాయి. ఈ నేపథ్యంలోనే గత నెలలో దమ్మపేట మండలంలోని గణేష్‌పాడు వద్ద గ్రామం మీదుగా విద్యుత్ శాఖ చేపట్టిన విద్యుత్ టవర్లను నిర్మాణాలను స్థానిక ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. రహదారి నిబంధనల ప్రకారమే టవర్ల నిర్మాణాన్ని చేయాలని, టవర్ల నిర్మాణాలకు తీయించిన గుంతలను బ్లేడ్ ట్రాక్టర్‌తో పూడ్చి వేసి అడ్డుకున్నారు. దీంతో ఈ రెండు శాఖల మధ్య సాగుతున్న వివాదం బహిర్గతమైంది.

ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తాం..



విద్యుత్ లైన్లు, కరెంట్ స్తంభాలను తొలగించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తున్నాం. నిబంధనల ప్రకారమే వాటిని తొలగిస్తాం. గతంలో లైన్ల నిర్మాణం, స్తంభాల ఏర్పాటును మౌలిక సదుపాయాల్లో భాగంగా వేసినవే. అన్ని చోట్ల జరిగేది ఇదే. ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి విద్యుత్ శాఖకు ఇప్పటిదాకా డిపాజిట్ నగదు బదిలీ కాలేదు. కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకోలేదు. దీంతో పనులు చేపట్టలేదు. ఏదైనా ఉంటే ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటాం.

– వెంకటరత్నం, ట్రాన్స్‌కో ఏడీఈ, అశ్వారావుపేట

ఆఫ్‌టైప్ మొక్కల నరికివేత



జగ్గారం శివారులోని పామాయిల్ క్షేత్రంలో ఆఫ్‌టైప్ మొక్కలను నరుకుతున్న కూలీలు

దమ్మపేట: ఏమాత్రం దిగుబడి రాని ఆఫ్‌టైప్ పామాయిల్ మొక్కలను రైతులు నరికించేస్తున్నారు. మండల పరిధిలోని జగ్గారం గ్రామ శివారులో చెలికాని సూరిబాబు అనే రైతుకు చెందిన ఏడు ఎకరాల పామాయిల్ తోటలో.. 34 ఆఫ్‌టైప్ మొక్కలు రాగా వాటిని ఆదివారం కూలీలతో నరికించారు. సుమారుగా ఏడు సంవత్సరాల పాటు ఈ మొక్కలను సాగు చేసినప్పటికీ.. 34 ఆఫ్‌టైపులో ఏ చెట్టుకు గెలలు కాయలేదు. దీంతో విసుగు చెందిన రైతు, చేసేదేమీ లేక ఆ మొక్కలను నరకడం ప్రారంభించారు. ఈ ఆఫ్‌టైప్ మొక్కల కారణంగా మూడు లక్షల రూపాయల మేరకు నష్టపోయానని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి తొలగించిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటినప్పటికీ, దిగుబడి వచ్చేవరకు మరోమారు అదనపు పెట్టుబడితో పాటుగా ఐదు సంవత్సరాల కాలం వృథా అని వాపోయారు. ఇంత జరిగినా ఆయిల్ ఫెడ్ వారు ఇచ్చే కొత్త మొక్కల్లో కూడా ఆఫ్‌టైప్ మొక్కలు ఉండవనే గ్యారెంటీ కూడా లేదన్నారు.

'సీతారామ' నీళ్లు ఇవ్వాలి



అన్నపురెడ్డిపల్లి: సీతారామ కాలువ వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): సీతారామ కాలువ నీళ్లు ఇతర ప్రాంతాలకు ఇవ్వకుండా జిల్లా రైతులకు ఇవ్వాలని బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేట్టారు. మండలంలోని గుంపెన గ్రామ శివారులో ఉన్న సీతారామ కాలువ వద్ద ఆ పార్టీ శ్రేణులు రైతులతో కలిసి ఆందోళన చేశారు. భూములు కోల్పోయిన రైతుల భూములకు కాకుండా ఇతర ప్రాంతాలకు గోదావరి జలాలు తరలించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సత్వరమే స్పందించి స్థానిక వ్యవసాయ భూములకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలుత మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ ఆందోళనలో బీఆర్‌ఎస్ నాయకులు వేముల హరీష్, మామిళ్ళపల్లి రామారావు, వద్ది వెంకటేశ్, ప్రవీణ్, కిరణ్, సుధాకర్, గోపాలరావు పాల్గొన్నారు.

ఏజెన్సీకి అందించాలి..

గుండాల: దుమ్ముగూడెం వద్ద నిర్మించిన సీతారామ ప్రాజెక్టు నుంచి సాగునీటిని ఏజెన్సీకి మళ్లించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు వాగబోయిన చంద్రయ్య దొర డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం వల్ల నీరందుతుందని పినపాక, కొత్తగూడెం, ఇల్లందు, భద్రాచలం నియోజకవర్గ ప్రజలు ఎంతో ఆశపడ్డారని, కానీ ప్రభుత్వం వారి ఆశ నిర్వీర్యం చేస్తూ.. ఈ ప్రాంత నీళ్లను ఖమ్మంలోని పొంగులేటి భూములకు, సత్తుపల్లిలోని తుమ్మల భూములకు, మధిరలోని భట్టి భూములకు అందిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత హక్కులను కాపాడవలసిన ఇల్లెందు, పినపాక, భద్రాచలం నియోజకవర్గాల ఎమ్మెల్యేలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సంబశివరావు జిల్లాకి సీతారామ నీళ్లు ఇవ్వాలని మంత్రుల ముందు ఎంతో నిబ్బరంగా డిమాండ్ చేసినప్పటికీ స్థానిక ఎమ్మెల్యేలు స్పందించకపోవడాన్కిన తప్పుబట్టారు. జిల్లా రైతులందరికీ నీళ్లు అందే వరకు అన్నదాత సుఖీభవ పాదయాత్ర జిల్లా వ్యాప్తంగా చేస్తామని, జిల్లా కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు.

క్రీడలతో ఆరోగ్యానికి మేలు



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి

దమ్మపేట: క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి అన్నారు. ఆదివారం మండల కేంద్రం దమ్మపేట శివారులో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్ చేతులమీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులను పరిచయం చేసుకుని, వారితో సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... క్రీడలు వ్యాయామం మాదిరిగా శారీరక దారుఢ్యాన్ని పెంచడానికి తోడ్పడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మెచ్చు వెంకటేశ్వర్లు, చిన్నశెట్టి యుగంధర్, సాయిల నర్సీ, ముళ్లపూడి వెంకటేశ్వరరావు, పగడాల రాంబాబు, శ్రీకాంత్, వాసం శ్రీను, ఈశ్వరప్రగడ భూషణ్, వాసం వేణు పాల్గొన్నారు.

సమస్యలపై బీఆర్‌ఎస్ పోరాటం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు

భద్రాచలంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రజలు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పడుతున్న కష్టాలపై బీఆర్‌ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. ఆదివారం భద్రాచలంలో పర్యటించిన ఆయన స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు రావులపల్లి రాంప్రసాద్ నివాసంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే రాష్ట్ర ముఖ్యమంత్రి పేరును మర్చిపోతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఏ గ్రామంలో కూడా 30 శాతంకి పైగా రైతు రుణమాఫీ జరగలేదని ఆయన ఆరోపించారు. 2014 నుంచి 2023 వరకు కేసీఆర్ పాలనలో హైదరాబాద్ నగరంలో ఎక్కడా కూడా వాటర్ ట్యాంకర్ రాలేదని, ఇప్పుడున్న పరిస్థితిలో ఎటువైపు చూసినా హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్లు దర్శనమిస్తున్నాయని అన్నారు. గోదావరి పరివాహక ప్రాంతం అంతా ఇసుక వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా సాగుతోందని, రాష్ట్ర ప్రభుత్వానికి ఇసుక మాఫియాపై ఉన్న ప్రేమ ప్రజల మీద ఉంటే వారు పడుతున్న బాధలు కనిపిస్తాయని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న గర్భిణులకు ఉపయోగపడేలా బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ కిట్‌ను అందజేస్తామని, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అక్కసుతో కిట్ పేరును ఎంసీహెచ్‌గా మార్చిందని, అయినప్పటికీ వాటిని లబ్ధిదారులకు అందజేయడం లేదన్నారు. సమావేశంలో భద్రాచలం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మానే రామకృష్ణ, మండల పార్టీ కన్వీనర్, కో-కన్వీనర్ రేపాక పూర్ణ చంద్రరావు, తుమ్మలపల్లి ధనేశ్వరరావు, మహిళా నాయకులు పూజల లక్ష్మి, ప్రియాంకలు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



నాటి గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

బూర్గంపాడు: అంజనాపురం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 1995-96లో 7వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 30 ఏళ్ల క్రితం పాఠశాలలో చదువుకున్న 25 మంది పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని, ప్రస్తుత స్థితిగతులను మాట్లాడుకున్నారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు యాకుబ్, నర్సింహారావు, భారతి, సత్యనారాయణ, శైలజ, సుధామదేవిలను ఘనంగా సత్కరించారు. నాడు ఉపాధ్యాయులు దిద్దించిన అక్షరాలే నేడు జీవితంలో ఉన్నతస్థాయిలో నిలిపాయని పూర్వ విద్యార్థులు అన్నారు. తమను గుర్తుంచుకుని ఈ కార్యక్రమాన్ని ఆహ్వానించి సత్కరించటం ఆనందంగా ఉందని నాటి గురువులు అన్నారు. కుటుంబ సభ్యులతో కలసి పాల్గొనటం మరిచిపోలేని అనుభూతినిచ్చిందని పూర్వవిద్యార్థులు అభిప్రాయపడ్డారు.

మాల మహానాడు జిల్లా మహిళా కమిటీ ఎన్నిక

బూర్గంపాడు: మాల మహానాడు జిల్లా మహిళా కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కృష్ణసాగర్ గ్రామంలో జరిగిన సమావేశంలో జిల్లా మహిళా కమిటీ అధ్యక్షురాలిగా బోడ దివ్య, ప్రధాన కార్యదర్శిగా మద్దేటి జయలను ఎన్నుకున్నట్లు మాల మహానాడు జిల్లా అధ్యక్షులు తోటమళ్ల రమణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. మాలల సంక్షేమం కోసం తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పల్లంటి రమేష్, తోటమళ్ల గోపాలరావు, బేతం బాబు, అంతోటి నాగరాజు,ఉసిల్ల రాజేష్, గడేసుల జ్యోతి పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామ శివారులో ఉన్న చిలకల గండి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకొని, ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించారు. అలాగే మధ్యాహ్న సమయంలో ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు.

లైంగిక దాడి నిందితుడిని శిక్షించాలి



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా కార్యకర్తలు

అశ్వారావుపేటరూరల్: జగిత్యాల జిల్లాలో గత నెల 27వ తేదీన ఆశ కార్యకర్తపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. ఆదివారం అశ్వారావుపేటలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఆశ కార్యకర్తను బెదిరించి లైంగిక దాడికి పాల్పడటం హేయమైన చర్య అన్నారు. తక్షణమే ఆశ కార్యకర్తలకు భద్రత కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కట్టా రాధ, భారతి, రాజేశ్వరి, నాగమణి, యామిని, నాగ దుర్గ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ఎదగాలి



పారిశుద్ధ్య కార్మికురాళ్లను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మణుగూరురూరల్: మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదగాలని మణుగూరు పట్టణ ప్రైవేట్ గైనకాలజిస్ట్ డాక్టర్ సంఘమిత్ర, బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు లింగంపల్లి రమేష్ వేర్వేరు కార్యక్రమాల్లో అన్నారు. మండలంలోని సంతోష్ నగర్‌లో అంబేడ్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో, బాపనకుంట గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంతోష్‌నగర్‌లో జరిగిన వేడుకలో డాక్టర్ సంఘమిత్ర కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి మహిళా ఔన్నత్యాన్ని వివరించారు. బాపనకుంట గ్రామంలో పారిశుద్ధ్య కార్మికురాళ్లను బీజేపీ నాయకులు శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో టీజీడబ్ల్యూయూఆర్‌జేసీ గురుకుల పాఠశాల హెచ్‌ఎం రాణి, హెచ్‌ఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షురాలు శ్రీలత, సేవా సమితి నాయకురాళ్లు కరుణ, స్వరూప, సువర్ణ, శైలజ, స్వేచ్ఛ, భద్రమ్మ, నాగమణి, సునీత, తిరుపతమ్మ విజయ, బీజేపీ నాయకులు బీర రమేష్, గుంటక వెంకటేశ్వర్లు, భోగ వెంకట్, వాకపల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో చోరీ

దుమ్ముగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కొత్తపల్లి గ్రామానికి చెందిన బెజ్జంకి వీరభద్రచారి ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరభద్రచారి ఈ నెల 6వ తేదీన జూలురుపాడులో జరిగే ఓ శుభ కార్యక్రమానికి హాజరు అయ్యేందుకు వెళ్లి ఈ నెల 8వ తేదీ రాత్రి తిరిగి వచ్చారు. ఈ క్రమంలో ఇంటి లోపల పరిశీలించగా బీరువా పగులకొట్టి దాంట్లోని నగదు, బంగారం దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. రాత్రి సమయం కావడంతో ఆదివారం ఉదయం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ వెంకటప్పయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

'వర్గీకరణ చేయకపోతే చావు డప్పు'

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణ చేయకపోతే సీఎం రేవంత్ రెడ్డికు చావు డప్పు తప్పదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏపూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక రింగ్ రోడ్ సెంటర్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, డప్పు దరువుతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటాలతో మాదిగలకు వచ్చిన అవకాశాన్ని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సహకారంతో అడ్డుకుంటున్నారని, ఏబీసీడీ వర్గకరణ చట్టం చేసే దాకా గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాల నియామకాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా నేడు సత్తుపల్లిలో రెండు వేల మందితో వెయ్యి డప్పులతో నిర్వహించే ర్యాలీకు బాధ్యులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అలాగే దళిత యువకుడిపై థర్డ్ డిగ్రీకి పాల్పడిన స్థానిక అదనపు ఎస్సై రామ్మూర్తిపై తక్షనమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. టీడీపీ నాయకులు కట్రం స్వామి దొర, గిరిజన సంఘం బాధ్యులు పాయం దుర్గారావు, బీజేపీ నాయకురాలు మద్దాల దేవి మద్దతు పలికారు. నాయకులు కోలేటి ఫకీరయ్య, కొలిగుపోడు కాంతరావు, నార్లపాటి శ్రీను, కలపాల శ్రీనివాసరావు, నార్లపాటి సుదర్శన్, రాయల పోలయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: జస్టిస్ షమీమ్ అక్తర్ నివేధికలను సవరించి ఎస్సీ వర్గీకరణను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో డప్పుల ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోయిళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలంగాణ అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు జనాభా ప్రాతిపదికన ఇవ్వాల్సిన రిజర్వేషన్లలో తీరని అన్యాయం జరిగిందన్నారు. 33 లక్షల జనాభా కలిగిన మాదిగలకు 11శాతం రావాల్సి ఉండగా.. 9శాతం కల్పించడం సరికాదన్నారు. దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. గత 30ఏళ్ళుగా మాదిగలు విద్య, ఉద్యోగ, రాజకీయ పరంగా నష్టపోయారన్నారు. అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు రిజర్వేషన్‌తో పాటు రేవంత్‌రెడ్డి ప్రభుత్వ మంత్రివర్గంలో కూడా చోటు దక్కలేదని వాపోయారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు కేబినెట్ మంత్రి పదవులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మోదుగు వెంకటేశ్వరరావు, మండల ఇన్‌చార్జ్ కొమ్ము హుస్సేన్, బోయిళ్ళ నర్సింహరావు, పొడుతూరి కళ్యాణ్, ఉసికల కొండయ్య, చిట్యాల రజిత పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: అంబేడ్కర్ విగ్రహం వద్ద డప్పులతో ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన..



మణుగూరురూరల్: డప్పు ప్రదర్శన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు